సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



విద్యుత్‌కు వేసవి షాక్..!

వేసవిలో ఎండల తీవ్రతతో పాటు విద్యుత్ హెచ్చుతగ్గులు వినియోగదారులను షాక్‌కు గురిచేస్తున్నాయి. - 8లో



సర్కారు తీరుపై గురువుల గుర్రు

విద్యారంగంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరిని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాలు బుధవారం ధర్నా చేపట్టాయి. - 8లో

పోలమాంబ పదో జాతర ఆదాయం రూ.1,34,701

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి పదోజాతర ఆదాయాన్ని ఈవో వి.వి.సూర్యనారాయణ సమక్షంలో బుధవారం లెక్కించారు. ప్రత్యేక దర్శనం టికెట్ల విక్రయంతో రూ.32,900, మహా అన్నదానం విరాళాల రూపంలో రూ.56,801, చండీ హోమం ఆదాయం రూ.45వేలు మొత్తంగా రూ.1,34,791 వచ్చినట్లు ఈవో తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లా మత్స్య శాఖాధికారిగా సంతోష్ కుమార్



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మత్స్యశాఖాధికారి

పార్వతీపురం టౌన్: జిల్లా మత్స్య శాఖాధికారిగా టి.సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలెక్టరేట్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొన్నటివరకు జిల్లా మత్స్య శాఖాధికారిగా పనిచేసిన వి.తిరుపతయ్య లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంగతి తెలిసిందే. జిల్లాలో మత్స్యకారులకు మేలు జరిగేలా చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా మత్స్య శాఖాధికారిని కలెక్టర్ కోరారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఆర్‌బీఎస్‌కే పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవన్‌రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై అభ్యంతరాలుంటే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉన్న ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే కార్యాలయంలో అందజేయాలన్నారు.

కేసుల పురోగతిని సీసీటీఎన్‌ఎస్‌లో ఉంచాలి

- ఏపీ రాష్ట్ర పోలీస్ ఐజీ పర్సనల్స్ ఎస్.హరికృష్ణ



డీపీఓలో జరిగిన నెలవారీ నేర సమీక్షలో సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న పర్సనల్స్ ఐజీ హరికృష్ణ

విజయనగరం క్రైమ్: కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టంలో నమోదుచేయాలని ఏపీ రాష్ట్ర పోలీస్ ఐజీ పర్సనల్స్ ఎస్.హరికృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న పోలీసు అధికారులతో బుధవారం నిర్వహించిన మాసాంతర నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. సీసీటీఎన్‌ఎస్‌పై ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏదైనా నేరం జరిగినప్పుడు సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి వీలైనంత తక్కువ సమయంలో చేరుకోవాలన్నారు. నేర స్థలంను క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేసి, కేసులు ఛేదించేందుకు అవసరమైన సాంకేతిక ఆధారాలను సేకరించాలన్నారు. ఆలయాలు, ప్రార్థనామందిరాల రక్షణకు స్థానికులతో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. హత్య, రేప్, గంజాయి, రోబరీ, పోక్సో కేసుల్లో నిందితులు, శిక్షలు పడిన వ్యక్తుల ప్రవర్తనపై నిఘా పెట్టేందుకు వెంటనే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, నేరస్తులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్య రెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మూడేళ్లు.. అభివృద్ధి మూణ్నాళ్లు!


- 2022, ఏప్రిల్4న నూతనంగా ఆవిర్భవించిన పార్వతీపురం మన్యం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో శరవేగంగా అభివృద్ధి పరుగులు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు.. విఘాతం

సాక్షి, పార్వతీపురం మన్యం:

అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకు సమానంగా అందాలి... పాలన చేరువకావాలి.. పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా ఏర్పాటుచేసింది. ఆ క్రమంలోనే ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉన్న నాలుగు నియోజకవర్గాలతో 2022, ఏప్రిల్ 4వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడింది. 15 మండలాలు, ఒక నగర పంచాయతీ, రెండు పురపాలక సంఘాలతో పార్వతీపురం కేంద్రంగా కొత్త జిల్లా రూపుదిద్దుకుంది. జిల్లా ఆవిర్భావం తర్వాత నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషితో అభివృద్ధి పనులు చకచకా సాగాయి. విద్య, వైద్యానికి ప్రాధాన్యమిచ్చిన అప్పటి ప్రభుత్వం.. జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రుల నిర్మాణం, రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రభుత్వం మారడంతో అభివృద్ధి మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం జిల్లాపై దృష్టి సారించకపోవడంతో అన్ని వర్గాలకూ ఇబ్బందులు తప్పడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రస్తుత కలెక్టరేట్



కలెక్టరేట్ నిర్మాణానికి 59.80 ఎకరాల స్థలం కేటాయించినది ఇక్కడే...

పడకేసిన పరిపాలన

రూ.99.90 కోట్లతో సమీకృత కలెక్టర్ కార్యాలయం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం చొరవ తీసుకుంది. పార్వతీపురం మండలం అడ్డాపుశీల వద్ద 59.80 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రభుత్వం మారడంతో ముందుకు సాగలేదు. ఇప్పుడు దాని ఊసేలేదు. ఐటీడీఏ కోసం నిర్మించిన భవనాల్లో కలెక్టరేట్ నడుస్తుండగా.. కొన్ని శాఖలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇక, కీలక విభాగాల్లో అధికారుల పోస్టులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటున్నాయి. రెండు ఐటీడీఏలకు పీవోలు కూడా లేని పరిస్థితి. ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. ఉద్యోగులు కూడా ఇక్కడికి వచ్చేందుకు ఎవరూ ఇష్టపడటం లేదు. మూడేళ్ల కిందట జిల్లా ఆవిర్భావమప్పుడు వచ్చిన ఉద్యోగులే ఇక్కడ 'చిక్కుకుపోయారు.' కొత్తగా వచ్చేవారు ఎవరూ లేకపోవడంతో బదిలీలైనా కదలలేని పరిస్థితి. జిల్లా కేంద్రంలో పని చేసేందుకు అధికారులు, ఉద్యోగులు ఇష్టపడడం లేదు. చిన్న జిల్లా కావడం.. వసతి, ఇతర సౌకర్యాలు అంతంతమాత్రంగానే కావడంతో ఏదో విధంగా ఇక్కడ నుంచి తప్పించుకుంటున్నారు.



పూర్తికాని కురుపాంలోని ఇంజినీరింగ్ కళాశాల భవనం

విద్య, వైద్యం దైన్యం


జిల్లా కేంద్రంలో రూ.600 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, పార్వతీపురం, సీతంపేటల్లో రూ.50 కోట్ల చొప్పున మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి జిల్లా ఆవిర్భావం తర్వాత నాటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ వైద్యకళాశాలకు నేడు అతీగతీ లేకుండా పోయింది. ఉంటుందో, లేదో తెలియని పరిస్థితి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సగం నిర్మాణాలతో చూస్తోంది. పనుల్లో పురోగతి లేదు. జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినా... రోగుల తాకిడి పెరుగుతున్నా.. కనీస సౌకర్యాలు కానరావడం లేదు. 150 పడకలు ఉంటే రోజుకు 300 నుంచి 400 వరకు ఓపీ నమోదవుతోంది. ఇక్కడ మల్టీ స్పెషాలిటీ బ్లాక్‌ను కూడా త్వరితగతిన పూర్తిచేసి 300 పడకలు అదనంగా కల్పిస్తామని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గత ఆగస్టులో ప్రకటించినప్పటికీ.. కార్యరూపం దాల్చలేదు. రెండు జిల్లాల పరిధిలో ఏర్పాటు కానున్న గిరిజన విశ్వవిద్యాలయం నత్తనడకన సాగుతోంది.



అసంపూర్తి పనులతో కనిపిస్తున్న పార్వతీపురం మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి భవనం



- కురుపాం నియోజకవర్గ పరిధి కురుపాం పంచాయతీ టేఖరకండి గ్రామ సమీపంలో 105 ఎకరాల్లో నాడు రూ.190 కోట్ల వ్యయంతో చేపట్టిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. 60 శాతం పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. వైద్య, ఇంజినీరింగ్ కళాశాలలు పూర్తయితే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగరం. వైద్య శాలలు అందుబాటులోకి వస్తే రోగులకు విజయనగరం, విశాఖపట్నం వెళ్లే ఇక్కట్లు తప్పుతాయి.



జంఘావతి ప్రాజెక్టు

అసంపూర్తి పనులు

కొమరాడ మండలంలో నాగావళి నదిపై పూర్ణపాడు-లాభేసు వంతెన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. జంఝావతి సమస్యపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఈ ప్రాజెక్టు నీరుగారిపోతోంది. ఉమ్మడి జిల్లాలోని 12 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన పాచిపెంట మండల పరిధిలోని పెద్దగెడ్డ జలాశయం ఆధునికీకరణ పనులు సాగడం లేదు. మూడేళ్ల క్రితం జైకా నిధులు రూ.28 కోట్లతో మరమ్మతులు ప్రారంభించినా.. తర్వాత అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కాలువలకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. జిల్లాకు జీవనాడి లాంటి తోటపల్లి మిగులు పనులకు నిధులు విదిల్చిన దాఖలాలు లేవు. కాలువల ఆధునికీకరణ జరగక 65 వేల ఎకరాలకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి. మిగిలిన ప్రాజెక్టులదీ అదే పరిస్థితి.

- ఏనుగుల సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. కుంకీ ఏనుగులు తెప్పించి సమస్యను పరిష్కరిస్తామన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. సీతానగరం మండలం గుచ్చిమి వద్ద రూ.3 కోట్ల వ్యయంతో తాత్కాలిక ఏనుగుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీనిపై స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రధానంగా జిల్లా ఆవిర్భావం తర్వాత ఆక్రమణలు పెరిగిపోయాయి. జిల్లా కేంద్రంలో చెరువులు, రహదారులను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. పార్వతీపురం పట్టణంలోని దేవునిబంద, బెలగాంలోని నెల్లి చెరువు, సుందరనారాయణపురం పరిధిలోని కోదువానిబంద, కొత్తవలస సమీపంలోని సంగంనాయుడు చెరువు ఆక్రమణల చెరలో చిక్కిపోయాయి. రహదారులపై ఆక్రమణలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా.. కొత్తగా జిల్లాకు తీసుకొచ్చిన పరిశ్రమలు ఒక్కటీ లేదు. యువతకు ఉపాధి కరువైంది.

గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి గుర్తించాలి

2022లో ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటు చేసినా నేటికీ జిల్లాలను కేంద్రం స్థాయిలో గుర్తింపునకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. తక్షణమే గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి కొత్త జిల్లాలకు గుర్తింపు ఇస్తే కేంద్రం నుంచి నిధులు వస్తాయి. లేదంటే అప్పటివరకు పాత జిల్లాలకు వచ్చిన నిధులనే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి. ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–పాలక రంజిత్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

ప్రకృతి వ్యవసాయ జిల్లాగా పార్వతీపురం మన్యం

- వేయి ఎకరాల విస్తీర్ణంలో పైనాపిల్ సాగు
- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాను ప్రకృతి వ్యవసాయ జిల్లాగా మార్చుచేసేందుకు కృషిచేయాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలో 4,800 ఎకరాల వరకు పైనాపిల్ సాగు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, కేవలం 250 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయడంపై అధికారులను ప్రశ్నించారు. ఈ ఏడాది కనీసం వేయి ఎకరాల్లో పైనాపిల్ సాగు జరగాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రాథమిక రంగాల వృద్ధిపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సేంద్రియ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. నిమ్మగడ్డికి గిరాకీ ఉందని, రైతులు సాగుకు మొగ్గుచూపేలా రాయితీలు అందజేయాలన్నారు. రెండు వేల ఎకరాల్లో నిమ్మగడ్డిని సాగు చేసేందుకు అవకాశం ఉందని, ప్రస్తుతం 833 ఎకరాల్లో సాగవుతున్నట్టు వెల్లడించారు. జీడి, పసుపు, ఇతర అంతర పంటల సాగుపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జీవాలు, పశువులు, కోళ్ల పెంపక యూనిట్లను ప్రోత్సహించాలన్నారు. ఫాం పాండ్స్ చేపల పెంపకానికి అనువుగా ఉంటాయన్నారు. 90 గ్రామాల్లో 120 చెక్ డ్యాముల పనులు ప్రారంభించామని, వేసవిలో వీటి నిర్మాణాలు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పంటల సాగుపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవర్థక శాఖల అధికారులు కె.రాబర్ట్‌పాల్, బి.శ్యామల, టి.సంతోష్ కుమార్, ఎ.వి.సాల్మన్‌రాజు, డా.ఎస్.మన్మథ రావు, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ పథక సంచాలకులు సుధారాణి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఎల్.డి.ఎం. ఎన్.విజయ్ స్వరూప్, కేవీకే శాస్త్రవేత్త డా. శ్రీనివాసరాజు, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్, డీసీఓ పి.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

6,205 రెవెన్యూ సదస్సుల నిర్వహణ

పార్వతీపురంటౌన్: జిల్లాలో 6,246 రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా, 6,205 సదస్సులను (99.34 శాతం) నిర్వహించినట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అడిషనల్ సీసీఎల్ఏకు వివరించారు. రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, రెగ్యులరైజేషన్, నీటి పన్ను తదితర అంశాలపై కలెక్టర్లతో అడిషనల్ సీసీఎల్ఎ సెక్రటరీ డా.ఎస్.ప్రభాకరరెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాల వారీగా ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా 41 రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉందని, త్వరలో వాటిని నిర్వహించి శతశాతం పూర్తిచేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇప్పటి వరకు 29,778 అర్జీలు రాగా, వాటిలో 29,365 పరిష్కరించినట్టు వెల్లడించారు. మిగిలిన 413 అర్జీలు పరిష్కార దశలో ఉన్నాయన్నారు. ఈ వీడియో సమావేశంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు 16 రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా పరిస్థితులను బట్టి వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా జీడీపీ పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ముందుగా అనువైన నేలలను గుర్తించి, పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నూతన ఆర్థిక సంవత్సరంలో అన్ని పంటల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అరటి పంటకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ ఏడాది కనీసం 500 హెక్టార్లలో అదనంగా సాగయ్యేలా చూడాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు ఆనుకొని ఉన్న మండలాల్లో దీనిని విస్తరించడం వల్ల మార్కెటింగ్‌కు అవకాశం ఉంటుందన్నారు.



అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం

- బయలుదేరిన కొద్ది నిమిషాలకే పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్
- అప్రమత్తమైన గార్డ్, డ్రైవర్
- వెంటనే రైలు నిలుపుదల
- పట్టాలు తప్పి ఎక్కడికక్కడ నిలబడిపోయిన చివరి రెండు బోగీలు
- హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టిన అధికారులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వే డీఆర్ఎం, ఆర్డీఓ

విజయనగరం టౌన్:

నాందేడ్ నుంచి సంబల్‌పూర్ వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్ విజయనగరం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన కొద్ది నిమిషాలకే పట్టాలు తప్పింది. చివరి రెండు బోగీలు పట్టాలు తప్పినట్టు గుర్తించిన గార్డు, డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వెంటనే రైలును నిలుపుదల చేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. వందలాది మంది ఊపిరిపీల్చుకున్నారు. విజయజనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని సీఎంఆర్ కూడలి సమీపాన చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా..

విజయనగరం రైల్వేస్టేషన్‌కు విశాఖ నుంచి రైలు నంబర్ 20810 సంబల్ పూర్ – నాందేడ్ వెళ్లే సంబల్ పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం 11.50 గంటలకు విజయనగరం చేరుకుంది. 12.05 గంటలకు విజయనగరం నుంచి బయలుదేరింది. రైలు బయలుదేరే సమయం కావడంతో తక్కువ వేగంతోనే వెళ్తుంది. స్థానిక సీఎంఆర్ కూడలి వద్దకు వచ్చేసరికి రైలు చివరన ఉన్న జనరల్ బోగీ, గార్డ్ బోగీలు ప్రమాదంలో చిక్కుకున్నాయి. పట్టాలు తప్పాయి. అప్రమత్తమైన గార్డు డ్రైవర్‌కు వాకీటాకీలో సమాచారమివ్వడంతో డ్రైవర్ క్షణాల్లో రైలు నిలుపుదల చేశారు. పట్టాలు తప్పిన రెండు బోగీలలో జనరల్ బోగీ పట్టా నుంచి పక్కకు వచ్చి నిలబడిపోయింది. ముందు ఉన్న ఎక్స్‌ప్రెస్ బోగీలకు గానీ, వెనుక ఉన్న గార్డు బోగీకి ఎటువంటి ప్రమాదం జరగలేదు. పరిస్థితిని గమనించకపోయి ఉంటే మొత్తం బోగీలన్నీ ఒకదానిపై ఒకటి పేరుకుపోవడం, పక్కకు ఒరిగిపోవడం జరిగి ఉండేదని ఘటన చూసిన వారు చెబుతున్నారు. జనరల్ బోగీ పక్కకు రావడంతో అందులో ప్రయాణిస్తున్న సుమారు వందమందికిపైగా ప్రయాణికులు రైలు దిగిపోయి పరుగులు తీశారు. ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. సురక్షితంగా వారిని మిగతా బోగీల్లోకి ఎక్కించారు. అధికారులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన రక్షణ చర్యలు చేపట్టారు. గార్డుబోగీ, జనరల్ బోగీలను అక్కడే వదిలేసి రైలును యథావిధిగా పంపించారు.

ప్రమాదానికి కారణాలేంటి?


ఏళ్ల గడిచిన రైలు బోగీలే ప్రధాన కారణమా ? అరిగిపోయిన పట్టాలా? ఒకవేళ పాయింట్ వద్ద సమస్య ఉంటే రైలు ప్రారంభంలోనే పట్టాలు తప్పి పెనుప్రమాదం జరిగిపోవాలి. కానీ అలా జరగలేదు. కేవలం చివరి బోగీలు మాత్రమే పట్టాలు తప్పాయి. బోగీకి సంబంధించిన వీల్ అలైన్‌మెంట్‌లో లోపం వల్ల ఏమైనా ప్రమాదం చోటుచేసుకుందా? అన్న అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కీర్తి, అధికారులు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వే జీఎం


నాగావళి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందన్న విషయాన్ని తెలుసుకున్న రైల్వే జీఎం పరమేశ్వరన్ ఫంక్వల్ భువనేశ్వర్ నుంచి ప్రత్యేక రైల్లో విజయనగరానికి బుధవారం సాయంత్రం చేరుకున్నారు. డీఆర్ఎం లలిత్ బోరాతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి నివేదికపై అధికారులతో సమీక్ష చేయనున్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఆర్డీఓ దాట్ల కీర్తి, వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



సంఘటనా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోరా, తదితరులు

ప్రారంభించారు.. మూసేశారు..!

ఈ చిత్రాలు చూశారా.. సాలూరు పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి 2024 ఫిబ్రవరి నెల ఆఖరి వారంలో ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఒక వైద్యుడు ఉంటారని, గ్రామీణ ప్రజలు ఎవరైనా వైద్య తనిఖీలు చేయించుకుని మందులు ఉచితంగా పొందవచ్చని చెప్పారు. ఆమె వచ్చినప్పుడు ర్యాలీ నిర్వహించి టీడీపీ నేతలు, కార్యకర్తలు అట్టహాసం చేశారు. ప్రస్తుత స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంత ఆర్భాటంగా ప్రారంభించిన కేంద్రం ఏ నాడూ తెరచిన దాఖలాలేవు. ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెట్టేందుకే ఈ కేంద్రం తెరిచారని, ఇచ్చిన మాట, హామీ నెరవేర్చడమన్నది టీడీపీ నేతల డెయిరీలోనే ఉందదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్భాటం ఫుల్.. ఆచరణ నిల్ అంటూ విమర్శిస్తున్నారు. – సాలూరు



నారా భువనేశ్వరి ప్రారంభించిన సంజీవని ఉచిత ఆరోగ్య కేంద్రం ఇదే..



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి, పక్కన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి (ఫైల్)

క్లుప్తంగా

వంతెన వద్ద శిలాఫలకాన్ని ఢీకొన్న కారు

● ఇద్దరికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత సమీపంలో వంతెన వద్ద జాతీయరహదారిపై గజపతినగరం నుంచి రామభద్రపురం వెళ్తున్న కారు అదుపు తప్పి వంతెన వద్ద ఉన్న శిలాఫలకాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాల య్యాయి. రోడ్డు మధ్యలో ఆగి ఉన్న కారు ముందుభాగం నుజ్జునుజ్జయి ఉండడాన్ని గమనించిన స్థానికులు, వాహన చోదకులు కారు దగ్గరికి వెళ్లి అందులో గాయాలతో ఉన్న బాడంగి మండలంలోని డొంకినవలసకు చెందిన గండి శంకరరావు, గజరాయినివలసకు చెందిన మూడడ్ల భాస్కరరావులను బయటకు తీశారు. అంతలో రామభద్రపురం నుంచి వస్తున్న మహాప్రస్థానం వాహనంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పెదమానాపురం ఎస్సై జయంతి వద్ద ప్రస్తావించగా ఆస్పత్రికి వెళ్లి గాయాలైన వారిని పరామర్శించానని త్వరలో కోలుకుంటారన్నారు.

ఒక్కటై వచ్చిన రెండు ఏనుగుల జంటలు



నదీతీరంలో నాలుగు ఏనుగులు

భామిని: ఏనుగులు వెళ్లిపోయాయనే ఆనందం ఎక్కువ కాలం నిలబడలేదు. బుధవారం భామిని మండలం బిల్లుమడ సమీపానికి నాలుగు ఏనుగులు మళ్లీ తిరిగివచ్చాయి. రెండు రోజులుగా రెండు జంటలుగా అవి వీడి తిరుగుతున్నాయి. మంగళవారం ఒక ఏనుగుల జంట బిల్లుమడ నుంచి వంశధార నది మీదుగా ఒడిశా తీరంలోని మరో జంట ఏనుగుల వద్దకు చేరుకుంది. అనంతరం ఆ రెండు జంటలు కలిసి తిరిగి బిల్లుమడ నదీతీరానికి చేరుకున్నాయి. దీంతో రైతులు, అటవీ సిబ్బంది మళ్లీ ఏనుగుల టెన్షన్‌లో పడ్డారు.

పది లీటర్లసారాతో వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సారా, ద్విచక్రవాహనాన్ని చూపిస్తున్న సీఐ, ఎస్సైలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా అక్రమాలపై బుధవారం జరిపిన ప్రత్యేక దాడుల్లో జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ ప్రభాకరరావు 10 లీటర్ల సారాతో పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సారాతో పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేసి వినియోగించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం, సారా అక్రమంగా అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. దాడుల్లో ఎస్సై రాజశేఖర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో పీఏసీఎస్ సీఈఓ మృతి



ఎన్.గుంపస్వామి (ఫైల్)

గరుగుబిల్లి: గరుగుబిల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం సీఈఓ ఎన్.గుంపస్వామి గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం పీఏసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో హుటాహుటిన పార్వతీపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం సిబ్బంది తరలించగా చికిత్సపొందుతూ ఆస్పత్రిలోనే తుదిశ్వాస వదిలారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతిపట్ల సిబ్బంది, సహకారసంఘం అధికారులు సంతాపం తెలిపారు.

రేపు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐదు నుంచి పది తరగతులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈ నెల 4న ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తిరుమల విద్యాసంస్థల అధినేత ఎస్.తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశాఖపట్నంలో రాజులతాళ్లవలస తిరుమల క్యాంపస్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఈ అవగాహన సదస్సు జరుగుతుందని, మరిన్ని వివరాలకు 98489 86450, 98489 86451 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260

విద్యుత్‌కు వేసవి షాక్..!

● లోడ్ ఎక్కువైతే వైర్లు కాలిపోయే ఆస్కారం
● షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలకు ముప్పు
● సరఫరాలో లోపాలుంటే సిబ్బందికి ఫిర్యాదుచేయాలి



చిలకలపల్లి సబ్‌స్టేషన్

బలిజిపేట: వేసవి వచ్చిందంటే ఎండల తీవ్రత పెరుగుతూనే ఉంటుంది. ఇప్పటికే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి విద్యుత్ వినియోగాన్ని పెంచుకుంటాం. ఇంతవరకు బాగున్నా విద్యుత్ వినియోగం విద్యుత్ వైర్ల సామర్థ్యంపైన సందేహాలన్నీ, కన్సీల్డ్ వైరింగా, గోడల పైనే గొట్టాల్లో వైరింగ్ ఏర్పాటు చేశారా? సరైన ప్రమాణాలతో తగిన మందం ఉన్న వైర్లు వేశారా? అనేది అందరూ గుర్తించాల్సిన విషయం. వైరింగ్‌లో ఏవైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందనే విషయాన్ని గుర్తించాలి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలతో పాటు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు

అధికలోడుతో అనర్థమే:

వేసవి కాలంలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒకొక్కసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లో కాని, కార్యాలయాల్లో కాని వాడుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను నిర్ధారించుకుని ఆమేరకు విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారునికి అవసరమైన లోడ్‌ను ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ శాఖ అందుబాటులో ఉంచుతుంది. ఎవరైనా వినియోగదారుడు కేవలం 1కేవీ లోడుకు మాత్రమే అనుమతి పొంది వేసవి తీవ్రత దృష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. వినియోగదారులందరూ విద్యుత్‌శాఖకు సహకరించి వాడుతున్న లోడ్‌కు అనుగుణంగా అనుమతి పొందితే భవిష్యత్‌లో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉంటుందనే విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతరత్రా విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్లను వినియోగించాలి. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తుంటే సత్వరమే సంబంధిత విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి.

ఇలా చేయవద్దు:

గృహాలలో 15యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30యాంప్స్ విద్యుత్ భారం పడే పరికరాలు వినియోగిస్తే తీగలు కాలిపోయే ప్రమాదముంది.
☛ ఒకే స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే ఒక్కసారిగా లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశముంటుంది.
☛ ఎండలో విద్యుత్ తీగలు ఉంచితే భవిష్యత్తులో తీగలపై ఉన్న రబ్బర్ మెత్తబడి ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.
☛ ఇంటిలో ఒకేసారి విద్యుత్ ఉపకరణాలన్నింటినీ ఆన్‌చేసి ఉంచవద్దు.
☛ కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందర వందరగా ఉంచరాదు.
☛ రక్షణ పరికరాలైన ఎంసీబీ(మైక్రో సర్క్యూట్ బ్రేకర్), ఎంసీసీబీ(కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులను బైపాస్ చేయకూడదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

✔ వేసవికాలం ప్రారంభమయ్యే ముందు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఇళ్లు, కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించుకోవాలి.
✔ విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్‌ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రిని మాత్రమే ఉపయోగించాలి.
✔ ఇంట్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్‌శాఖ నుంచి లోడ్‌ను తీసుకోవాలి.
✔ అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు చేసుకున్న తరువాత ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఒవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించాలి.
✔ ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని బట్టి దానికనుగుణంగా నాణ్యత కలిగిన విద్యుత్ తీగలను వినియోగించాలి.
✔ నాసిరకం విద్యుత్ పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వైరింగ్ మరింత పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి.
✔ గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
✔ ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, దొడ్డు ఉప్పు ఉపయోగించాలి.
✔ విద్యుత్ వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
✔ విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా ఉండేలా చూసుకోవాలి.

అప్రమత్తత అవసరం:

వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉంది. షార్ట్‌సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. ఎటువంటి సమస్యలు ఉన్నా సిబ్బందికి తెలియజేయాలి.

సింహాచలం, ఏఈ, విద్యుత్‌శాఖ, బలిజిపేట

ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు శిక్షణ దోహదం

● డీఈఓ మాణిక్యం నాయుడు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈఓ మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: విద్యార్థుల నూతన ఆలోచనల నుంచి వచ్చే ఆవిష్కరణలను ప్రోత్సహించి వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి విక్షణ (ఈఎండీపీ) ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్‌ల సంయుక్త నిర్వహణలో స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం జరిగిన జిల్లా స్థాయి ప్రాజెక్టు ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసే విధంగా చేపట్టే కార్యక్రమాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకంగా ఉంటాయన్నారు. జిల్లా ఈఎండీపీ మేనేజర్ నరేష్ కాకర మాట్లాడుతూ ఈ ఎక్స్‌పో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడంతోపాటు భవిష్యత్తులో గొప్ప మార్గదర్శకులుగా ఎదిగేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ మనస్తత్వానికి అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి సూచించారు. జిల్లాలోని 15 పాఠశాలల నుంచి ఎంపికైన 9వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ అవిష్కరణలను ప్రదర్శించారు. జ్యూరీ సభ్యులు ప్రాజెక్టులను సమీక్షించి అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ప్రదర్శన పోటీల్లో మొదటి బహుమతిని గంట్యాడ ఎంజేపీఏపీ బీసీ బాలికల పాఠశాల, ద్వితీయ బహుమతిని జెడ్పీ హైస్కూల్ ఎస్.కోట కైవసం చేసుకున్నాయి. గురజాడ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ స్టేట్‌లీడర్ సుశాంత్ పాల్గొన్నారు.

మామపై అల్లుడి దాడి

గజపతినగరం రూరల్: మండలంలోని పాత బగ్గాం గ్రామంలో మామపై అల్లుడు దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..కొద్ది రోజులుగా అల్లుడి ప్రవర్తనపై విసుగుచెందిన మామయ్య సంగిరెడ్డి సత్యం పదే పదే మందలించడంతో ఆగ్రహానికి గురైన అల్లుడు కుమిలి ఆదినారాయణ తన కుటుంబసభ్యులతో కలిసి మామయ్యపై మంగళవారం రాత్రి దాడిచేసి గాయపరిచాడు. ఈ మేరకు బాధితుడు సత్యం ఫిర్యాదులో పేర్కొన్నట్లు గజపతినగరం ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. ఫిర్యాదుపై కేసునమోదుచేసి గాయాలపాలైన వ్యక్తిని స్థానిక ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్త తరలించినట్లు ఎస్సై చెప్పారు.

ఎలక్ట్రికల్ షాపులో షార్ట్ సర్క్యూట్



షాపులో కాలిపోయిన వస్తువులను చూపిస్తున్న బాధితుడు

జియ్యమ్మవలస: మండలంలోని చిన మేరంగి పాత బజార్‌లో గల శివ సంతోష్ ఎలక్ట్రికల్ షాపులో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో జరిగి విద్యుత్ పరికరాలు, టీవీలు కాలిపోయాయి. ఈ మేరకు సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. షాపు ప్రారంభించి 5 నెలలు కూడా కాలేదని ఇంతలో నష్టం సంభవించడం దురదృష్ట కరమని వాపోయాడు.

దేవాలయాలకు నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలి



మత పెద్దలతో మాట్లాడుతున్న సీఐ కె.మురళీధర్

పార్వతీపురం రూరల్: పట్టణంలో ఉన్న దేవాలయాలు, ప్రార్థనా మందిరాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పట్టణ సీఐ కె.మురళీధర్ కోరారు ఈ మేరకు ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలువురు మతపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలో 32 హిందూ దేవాలయాలు, 3 మసీదులు, 13 చర్చిలు, అలాగే పట్టణంలో ఉన్న పలు కూడళ్ల వద్ద ముఖ్య నేతల విగ్రహాలకు నిఘా నేత్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ ఏర్పాటులో ప్రార్థనాలయాల పెద్దలు, కమిటీ సభ్యులు సహకరించాలని స్వచ్ఛందంగా ముందుకు రావాలని సీఐ కోరారు.

జెడ్పీ చైర్మన్‌కు పరామర్శల వెల్లువ



మజ్జి శ్రీనివాసరావును పరామర్శిస్తున్న కురసాల కన్నబాబు తదితరులు

విజయనగరం:

విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు పరామర్శించారు. ఆయన ద్వితీయ కుమారుడు మజ్జి ప్రణీత్ బాబు మరణాంతరం స్థానిక మెట్రో ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా మజ్జి శ్రీనివాసరావు కుటుంబసభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ డిప్యూటీ సీఎంలు పీడికరాజన్న దొర, బూడి ముత్యాలనాయుడు, పాముల పుష్పశ్రీవాణి, ధర్మాన కృష్ణదాస్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మాజీమంత్రి, విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, విశాఖపట్నం జెడ్పీ చైర్మన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, శంబంగి వెంకట చిన్నఅప్పలనాయుడు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్‌రాజ్, కంబాల జోగులు, కడుబండి శ్రీనివాసరావు, గొర్లె కిరణ్‌కుమార్, నిమ్మక జయరాజు, విశ్వాసరాయ కళావతి, తిప్పల నాగిరెడ్డి, బడుకొండ అప్పలనాయుడు, తలారి వెంకట్రావు, భాగ్యలక్ష్మి, రాజాం అసెంబ్లీ ఇన్‌చార్జ్ తలే రాజేష్, పార్వతీపురం మన్యం జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, పాలవలస విక్రాంత్, ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీ మాధవ్, పాకలపాటి రఘువర్మ, విజయనగరం జెడ్పీ వైస్ చైర్మన్లు సిరిపురపు జగన్నాథ రావు, మరిశర్ల బాపూజీ నాయుడు, మాజీ ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొడ్డేటి మాధవి, మాజీ విజయనగరం జెడ్పీ చైర్మన్ స్వాతిరాణి, ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్విని, మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

పార్వతీపురం రూరల్/బలిజిపేట/మక్కువ: పార్వతీపురం మండల వైఎస్సార్‌సీపీ సభ్యులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. మండల పార్టీ కమిటీలో ఇద్దరు వైస్ ప్రెసిడెంట్లు, ఐదుగురు ప్రధాన కార్యదర్శులు, ఐదుగురు కార్యదర్శులు, 18మంది మెంబర్లను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు మండల వైస్ ప్రెసిడెంట్‌లుగా ఓలేటి మణిభూషణరావు, టి.శివున్నాయుడు, ప్రధాన కార్యదర్శులుగా గండి శంకరరావు, ఎం.చంద్రశేఖరరావు, వర్రి శ్రీను, చింతల ప్రసాద్, మర్రాపు వాసులను నియమించారు. అలాగే కార్యదర్శులుగా తర్లాడ అప్పలనాయుడు, భీమవరపు సూర్యనారాయణ, భూపతి శేఖర్, చప్పా శ్రీను, శివాజీ చందనలను నియమించారు. మెంబర్లుగా కర్రక ముష, సీర శ్రీహరి, పిరిడి ఆదినారాయణ, తాన్న శ్రీరాములునాయుడు, కిన్నెర కాంత సంగం, కోలక చింతామణి, గంట కృష్ణ, సంకారపు రామారావు, కొట్టక్కి పరమేష్, ఎం.గణేష్, నీలపు బలరాం, కొండతామర చెల్లయ్య, వేమిరెడ్డి కాశి, కోటి, వంగల మధుసూధనరావు, నెక్కల రామేశ్వరరావు, సూరయ్య, ఎస్.భూషణరావులును నియమితులయ్యారు.

మక్కువ మండల కమిటీ..

ప్రెసిడెంట్‌గా మావుడి రంగునాయుడు, వైస్ ప్రెసిడెంట్‌లుగా పూడి దాలినాయుడు, బలగ సావిత్రమ్మ, జనరల్ సెక్రటరీలుగా పెంట సంజీవనాయుడు, తేలు జ్యోతి, సిరికి సింహాచలం, చప్ప సూర్యనారాయణ, సెక్రటరీలుగా బురిడి చిన్నారావు, కొత్తూరు శంకరరావు, కోట్ల నారాయణమ్మ, తీళ్ల రామకృష్ణ, తెర్లి మోహిని, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వెలగడ వెంకటలక్ష్మి, పోలఉమామహేశ్వరి, మెయ్యి అప్పలస్వామి, అదపాక పోలమ్మ, పూడి రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సింగనపూరి తిరుపతి, సామంతుల వెంకటి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొల్లి జనార్ధనరావు, సొండి కల్యాణి, నడగణ శ్రీదేవి, మర్రి అయ్యప్ప, కొమ్ము గంగమ్మ, దొడ్డి సునీత రౌతుహరిరామసాయి, చప్ప కమల, పెంట కిశోర్ నియమితులయ్యారు.

బలిజిపేట మండల కమిటీ సభ్యులు..

పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేర బలిజిపేట మండల వైఎస్సార్ పార్టీ కమిటీ సభ్యులను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించడమైంది. ఈ కమిటీలో మండల ఉపాధ్యక్షులుగా గొల్లు పకీరు నాయుడు, గుల్ల ప్రభావతి, జనరల్ సెక్రటరీలుగా కడగల దాలినాయుడు, మండల ప్రసాద్, అక్కేన శ్రీనివాసరావు, అల్లు మహేశ్వర రావు, కార్యదర్శులుగా బొమ్మి నారాయణరావు, గులిపల్లి హేమంత్‌కుమార్, ముదిలి సత్యనారాయణ, పాలవలస రాజశేఖర్, బంకురు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కోమటిపల్లి సింహాచలం, ఆలుగుబిల్లి వెంకటరమణ, గొట్టాపు శంకరరావు, దాసరి త్రినాథరావు, అడప గోపాలకృష్ణ, చిట్టి పోలినాయుడు, సాలీల గంగయ్య, కిల్లాడ గోపినాయుడు, కిక్కరి శంకరరావు, బెవర నారాయణరావు, కండి నతానీలు, కొవ్వాడ సత్యంనాయుడు, మజ్జి శ్రీరామూర్తి నాయుడు, నడికుప్పల లక్ష్మణరావు, కర్రి సింహాచలంనాయుడు, రణదేవ్ లక్ష్మణరావు, పిరిడి శేషగిరిరావు, సువ్వాడ తవిటినాయుడు, గొల్లు సన్యాసినాయుడు, యామల చిన్నప్పరావు, బెవర జగ్గనాయుడు, పూడి వెంకటినాయుడు, గంట వెంకటినాయుడు, పడాల సూరపునాయుడు, గేదెల అక్కెంనాయుడు, గులిపల్లి సత్యంనాయుడు నియమితులయ్యారు.

చికిత్సపొందుతూ కానిస్టేబుల్ మృతి

విజయనగరం క్రైమ్: జొన్నవలస రైల్వేగేట్ వద్ద రైలు నుంచి జారిపడిన కానిస్టేబుల్ రామకోటి (37) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై బాలాజీ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బొబ్బిలి రామకోటి స్వస్థలం జామి మండలంలోని తాండ్రంకి గ్రామం. రామకోటి విజయనగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి కొత్తవలసకు బదిలీఅయ్యాడు. భార్య, పదకొండేళ్ల బాబుతో విజయనగరం ఉడాకాలనీలో నివాసం ఉంటూ రోజూ కొత్తవలస విధులకు వెళ్తూ ఉండేవాడు. ఈ నెల ఒకటవ తేదీన విశాఖలో పని ఉందని భార్యకు చెప్పి వెళ్లి తిరిగి ట్రైన్‌లో వస్తుండగా జొన్నవలస రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి జారి పడిపోగా ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలుశిక్ష

రామభద్రపురం: పోక్సో కేసులో విచారణ అనంతరం ముద్దాయికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.11 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. ఈ మేరకు ఎస్సై వి.ప్రసాదరావు బుధవారం తెలిపిన కేసు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆరికతోట గ్రామానికి చెందిన కనకల రమేష్ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించాడు.ఆ అమ్మాయి కూడా రమేష్‌ను ప్రేమించింది. ఆ బాలికను రమేష్ పెళ్లి చేసుకుంటాననడంతో తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. మరో సంబధం చూసి బాలికకు వివాహం నిశ్చయించారు. దీంతో రమేష్ ఆ అమ్మాయితో తిరిగిన ఫొటోలు, ఫోన్‌లో రికార్డ్ చేసి మాటలను పెళ్లిచేసుకోబోయే అబ్బాయికి పంపించాడు. దీంతో ఆ అబ్బాయి పెళ్లికి నిరాకరించడంతో సంబంధం తప్పిపోయింది. ఈ కారణంగా బాలిక తల్లిదండ్రులు 2021లో రమేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా సేకరించిన ఆధారాల మేరకు పోలీసులు పోక్సో నమోదు చేశారు.

సర్కారు తీరుపై గురువుల గుర్రు

● కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసనలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు



వినతిపత్రం అందుకుంటున్న డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: విద్యారంగంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరిని నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాలు ధర్నా చేపట్టాయి. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ నిర్వహించిన ఈ ధర్నాలో భారీసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ గడువు ముగిసి 21 నెలలైనా ఇప్పటికీ 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ఆందోళన నెలకొందని వాపోయారు. నిత్యం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్ 1వ తేదీ నాటికన్నా ముందు వచ్చిన నోటిఫికేషన్‌లో నియమితులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చి మెమో నంబర్ 57 ఉత్తర్వులను పలు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని దాన్ని పాటించాలని కోరారు.

కేంద్రం లాగానే రాష్ట్రం ప్రకటించాలి

ప్రతి ఆరు నెలలకు ఒకసారి కేంద్రప్రభుత్వం ప్రకటించే డీఏలకు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు, 2022 జూన్ నుంచి సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు. పంచాయతీ రాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పాల్తేరు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో వివిధ సంఘాల ప్రతినిధులు కె.విజయగౌరి, బంకురు జోగినాయుడు, సదాశివరావు, డి.రాము, డి.శ్యామ్, ఈశ్వరరావు, జోగారావు, బాబూలాల్ వెంకట నాయుడు, రమేష్ పట్నాయక్, సూరిబాబు, శ్రీనివాసరావు, వెంకటరమణ, భాస్కరరావు జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

■ విజయనగరం లోకల్ కార్పొరేషన్ పరిధిలో 167 చ॥గ॥ వుడా అప్రూవ్ స్థలంలో 2BHK ఇల్లు కేవలం 38 లక్షలు మాత్రమే అతి తక్కువ వడ్డీ రేటుతో 90% బ్యాంకు లోన్ సదుపాయం కలదు. 9391873337, 8143333494 [SCA25002463]

WANTED

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002548]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పెషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18k. ఫోన్: 9640400073, 9160900024 [SCA25002453]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీరూం+భోజనం. HYD. 8317512135 [HA-245]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.